సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



లక్ష్యం ఏమైంది..?

బాలికా సంరక్షణ పథకం మూలకు చేరింది. బాండ్లు ఉన్నా నిధులు అందడం లేదు.

- 8లో



ఆక్రమణల చెరలో 'పోర్ట్ ల్యాండ్'

పోర్టు ల్యాండ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. రెవెన్యూ సిబ్బంది స్పందించడం లేదు.

- 8లో

12 మందిపై కేసు

టెక్కలి రూరల్: రావివలస గ్రామానికి చెందిన 12 మంది పై కేసు నమోదు చేసినట్లు టెక్కలి ఎస్ఐ రాము తెలిపారు. రావివలస గ్రామంలో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా ఓ ఇంటి ముందు అధిక శబ్దాలతో డ్యాన్స్‌లు వేశారని, ఆపాలని కోరడంతో తగాదా జరిగిందన్నారు. సోమవారం ఉదయం కూడా అదే విషయంపై గొడవ జరిగిందన్నారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 12 మందిపై కేసు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ వర్ధంతిలో భాగస్వాములు కండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు



నరసన్నపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని మంగళవారం పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు వైఎస్సార్‌కు రుణపడి ఉంటారని కృష్ణదాస్ అన్నారు. ఆయన విగ్రహాల వద్ద నివాళులర్పించాలని సూచించారు.

వానలపై యంత్రాంగం అప్రమత్తం



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో దీని ప్రభావం కారణంగా జిల్లాలో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున సముద్రంలో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండా లని ఆదేశించారు. కాలువలు, చెరువులను పర్యవేక్షించాలని సూచించారు. రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో మరింత జగత్తగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

వర్షాలపై టెలీ కాన్ఫరెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో జిల్లాలో రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. సోమవారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 1, 2 మోస్తరు నుంచి భారీ వర్షాలు, సెప్టెంబర్ 3, 4 తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, సెప్టెంబర్ 5 అల్ప వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మంగళవారం ఉత్తరాంధ్ర తీర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సెప్టెంబర్ 2 నుంచి 5 వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

'జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు'

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో వరి, ఇత ర పంటలు కలిపి 3,73,000 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరిగిందని ఆయన వివరించారు. ఈ సాగుకు గాను మొదటి, రెండో విడతలలో కలిపి 20,481 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైందని అన్నారు. అయితే రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 11,443 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 12,393 మెట్రిక్ టన్నులు కలిపి, మొత్తం 23,836 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటివరకు రైతులకు సరఫరా చేసినట్లు కలెక్టర్ వివరించారు. అదనంగా స్పిక్ కంపెనీ ద్వారా శ్రీకాకుళం రోడ్డు రైలు హెడ్ వద్దకు 589 మెట్రిక్ టన్నులు సరఫరా అవుతున్నాయని చెప్పారు.

ఎచ్చెర్ల



రణస్థలంలో రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, రైతులు

ఆమదాలవలస



చింతాడ రవికుమార్‌తో పాటు రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

నరసన్నపేట



మడపాం టోల్‌గేటు వద్ద ఉద్రిక్తత

శ్రీకాకుళం



ఎంపీ స్వరూప్‌ను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

● ఎరువు అడిగితే దరువు!

అన్నదాతపై సర్కారు నిరంకుశం



జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు కుంభా రవిబాబు, నాయకులు మామిడి శ్రీకాంత్, అంబటి శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు తదితరులు

- అన్నదాతల సమస్యలపై నినదించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఆంక్షలు
- నిరసన చేపట్టకుండా ఎక్కడికక్కడ నిర్బంధాలు, అరెస్టులు
- రోడ్లపై బైఠాయించిన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు
- పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు
- ఇబ్బందులు పెట్టినా ఎరువు సమస్యలపై అధికారులకు నేతల విన్నపం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరించింది. రైతుల కోసం శాంతియుతంగా నిరసన తెలియజేద్దామని వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులను నిర్దాక్షిణ్యంగా అడ్డుకుంది. హౌస్ అరెస్టులు, ఎక్కడికక్కడ అడ్డుకోవడం, అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలిస్తూ ప్రశ్నించే హక్కును కాలరాసింది. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్సార్‌సీపీ రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మొద్దునిద్రలో ఉన్న ప్రభుత్వం దిగి రావాలని, యూరియాతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అన్ని రకాలుగా విఫలమైన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది.

మడపాంలో దాసన్నకు అడ్డగింత

మడపాం టోల్‌గేట్ దగ్గర పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో పాటు వస్తున్న నరసన్నపేట నియోజకవర్గ కేడర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. రైతుల పక్షాన నిలబడటానికి స్వేచ్ఛ లేదా అంటూ ధర్మాన కృష్ణదాస్ గట్టిగా అడగడంతో ఆయన వెహికల్ మాత్రమే వదిలారు. మిగతా వారికి ఆంక్షలతో అడ్డుకట్ట వేశారు.



జిల్లా పరిషత్ వద్ద మహిళా నాయకులను అదుపులోకి తీసుకుంటున్న దృశ్యం

రోడ్డుపై కిరణ్ బైఠాయింపు

రణస్థలంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో పాటు నియోజకవర్గ పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. శ్రీకాకుళంలో జరిగే నిరసన కార్యక్రమానికి వెళ్లవద్దని ఆంక్షలు విధించారు. రైతుల సమస్యలపై నిరసన చేస్తుంటే అడ్డుకోవడమేంటని గొర్లె కిరణ్‌కుమార్ ప్రతిఘటించినా పోలీసులు వదల్లేదు. దీంతో రహదారిపైనే కేడర్‌తో కలిసి బైఠాయించారు.

ఆమదాలవలసలో ఉద్రిక్తత..

నిరసన కార్యక్రమానికి వెళ్లడానికి సిద్ధమవుతున్న పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను తన కార్యాలయంలో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. అక్కడ కూడా అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ముందుకెళ్లేందుకు యత్నించిన రవికుమార్‌ను పోలీసులు అడ్డుకోవడంతో పోలీసుల తీరును తప్పు పట్టి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని పొందూరు, ఆమదాలవలస, సరుబుజ్జిలి తదితర మండలాల నుంచి శ్రీకాకుళంలోకి నిరసన కోసం వచ్చే వారందరినీ పోలీసులు అడ్డుకున్నారు. వేరే పనుల కోసం వస్తున్నామని చెప్పినా వినిపించుకోలేదు.

శ్రీకాకుళమంతా ఆంక్షలే..

వైఎస్సార్‌సీపీ చేపట్టిన రైతు సమస్యలపై నిరసన కార్యక్రమం జరగకుండా శ్రీకాకుళం నగరమంతా పోలీసులు ఆంక్షలు విధించారు. 80 అడుగుల రోడ్డు ఎంట్రన్స్ దగ్గర, వాంబే కాలనీ దగ్గర, పొన్నాడ బ్రిడ్జికి వెళ్లే రోడ్, సెవెన్ రోడ్ జంక్షన్, జెడ్పీ దగ్గర, సంతోషిమాత గుడి, కంపోస్టు కాలనీ ఏరియా వద్ద పోలీసులు దిగ్బంధం చేశారు. ఎవరినీ రానివ్వలేదు. దీంతో సాధారణ జనాలు కూడా ఇబ్బందులు పడ్డారు. రైతుల సమస్య కోసం నిరసన చేస్తే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రజలు వాపోయిన పరిస్థితులు కనిపించాయి. జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లను తీసేసి, అక్కడున్న వారందరినీ స్టేషన్‌కు తరలించేశారు. గేదెల పురుషోత్తం, చిట్టి జనార్దన్, మార్పు పృథ్వీతో మరి కొంతమందిని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లిపోయారు. మిల్లు జంక్షన్ దగ్గర ముంజేటి కృష్ణమూర్తి, బాలకృష్ణ, పీస గోపి, పీసీ శ్రీహరి, జిల్లా పరిషత్ దగ్గర నినాదాలు చేశారని అంధవరపు సూరిబాబు, కరిమి రాజేశ్వరరావు, బొడ్డేపల్లి పద్మజ, జయదేవ్, కణితి కృష్ణారావును అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు ఎంపీ స్వరూప్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, ఎంపీపీ గొండు రఘును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు వెనక్కి తగ్గలేదు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా రైతు సమస్యలపై అధికారులకు వినతి పత్రం ఇచ్చేవెళ్లారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసిన వారిలో పార్లమెంట్ పరిశీలకులు కుంభా రవిబాబు, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, తూర్పు కాపు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, పోలినాటి వెలమ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎస్సీ విభా గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి, యువ నాయకుడు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు రౌతు శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కామేశ్వరి, యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నక్క రామరాజు, అల్లు లక్ష్మీనారాయణ, చిట్టి రవి, గద్దిబోయిన కృష్ణయాదవ్, వెంకట రమణి, ప్రసాద్, పీస గోపి, పీస శ్రీహరి తదితరులు ఉన్నారు.



నిజం చెబితే నిర్బంధం.. నినాదం వినిపిస్తే నిరంకుశత్వం.. హామీలు గుర్తు చేస్తే ఆంక్షలు.. కూటమి ప్రభుత్వపు తీరు ఇది. గుండెలు అవిసేలా అన్నదాతలు ఎరువుల కోసం అడుగుతుంటే సర్కారు చెవికెక్కడం లేదు. ఎండనక, వాననక గంటల తరబడి క్యూలో రైతులు నిలబడుతుంటే ప్రభుత్వం కంటికి కనిపించడం లేదు. ఆఖరికి రైతు సమస్యపై వినతి పత్రం ఇస్తామన్నా.. తీసుకోవడానికి కూడా పాలకులకు మనస్కరించడం లేదు. ఎరువుల కొరతపై సోమవారం రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన ఆందోళనను ప్రభుత్వం ఖాకీల సాయంతో అణచివేయాలనుకుంది.

ఎరువులు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమిది

- రైతుల్ని నిర్బంధించే ప్రభుత్వాలేవీ మనుగడలో ఉండవు
- అరెస్టులు, నిర్బంధాలకు బెదిరేది లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ తీసుకువచ్చారు: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో, జిల్లాలో 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారని, వారిని కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. రైతుకు ఒక యూరియా బస్తా ఇవ్వలేని దిక్కుమాలిన స్థితిలో చంద్రబాబు ఉన్నారని మండిపడ్డారు. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలవుతున్నా కనీసం రైతులకు ఎరువు అందించలేకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు అండ్ టీమ్‌కు తెలుగు తమ్ముళ్లు తప్ప రైతులు కనిపించడం లేదన్నారు. ఎరువుల కొరతపై శ్రీకాకుళం డివిజన్‌లోని శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక సంఖ్యలో జిల్లా కేంద్రానికి చేరుకుని అధికారులకు వినతి పత్రం అందించాలని నిర్ణయించారు. కానీ పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకున్నారు. రైతు సమస్యలు చెబుతుంటే ఇన్ని ఆంక్షలు ఎందుకని కృష్ణదాస్ అన్నారు. ఆఖరికి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులకు మాత్రమే యూరియా ఇస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎలాంటి వివక్ష, వివాదం లేకుండా సకాలంలో అన్నదాతలకు ఎరువులు అందించామని గుర్తు చేశారు. జిల్లాలో వ్యవసాయశాఖ మంత్రి ఉన్నా రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. మిర్చి, పొగాకు, మామిడి, ఉల్లి రైతులు గిట్టుబాటు ధరలు లేక పంటలను పొలాల్లో వదిలేసే దుస్థితి వచ్చిందన్నారు. రైతుల్ని నిర్బంధించే ప్రభుత్వాలు ఉనికిలో లేకుండాపోయాయన్న సంగతి మరిచిపోకూడదన్నారు.

అప్రకటిత ఎమర్జెన్సీ

ఎమ్మెల్సీ, శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు కుంభా రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 80లక్షల హెక్టార్లలో పంట సాగు ఉంటే అందులో 50లక్షల హెక్టార్లలో వరి సాగు జరుగుతోందని దీనికి గాను 30లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా కేవలం 30 శాతం మందికి కూడా సరిపడని ఎరువులు సరఫరా చేస్తే మిగిలిన రైతులు ఏమవుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందన్నారు. రైతులకు ఎరువులు అందించాల్సింది పోయి రైతుల తరపున పోరాడుతున్న వారిని నిర్బంధించడం సరికాదన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని అన్నారు. కూటమిది ప్రచార ఆర్భాటమే తప్ప రైతులకు సాయం అందించిన దాఖలాలు లేవని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. యూరియా ఇవ్వలేని దిక్కుమాలిన ప్రభుత్వమని విమర్శించారు. రైతుల పక్షాన నిలబడే వైఎస్సార్ సీపీని అడ్డుకుంటే ఊరుకునేది లేదన్నారు.

గృహ నిర్బంధాలు, అరెస్టులు

ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంపీ స్వరూప్‌ని హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీలతో పాటు 15మందికి పైగా అరెస్ట్ చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.



శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ ముందు వైఎస్సార్ సీపీ నాయకులు



శ్రీకాకుళం మిల్లు జంక్షన్ వద్ద రైతులు, కార్యకర్తల్ని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

డిమాండ్లు ఇవే..

- శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ పరిధిలో గల రైతులకు వెంటనే ఎరువులు అందుబాటులో ఉంచాలి.
- ఎరువుల కొరత ఉన్న గ్రామాలపై దృష్టి పెట్టాలి. వారికి ప్రత్యేకంగా సరఫరా చేయాలి.
- ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచి రైతులకు అవసరాన్ని బట్టి అందజేయాలి.
- ఎరువుల నిల్వలు సమాచారం తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ లేదా వెబ్ సైట్ ఏర్పాటు చేయాలి.
- కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న అన్నదాత సుఖీభవ రూ. 20,000లు అందజేయాలి.
- ఉచిత పంటల భీమా అమలు చేయాలి. ఎరువుల పంపిణీపై వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా ఉంచాలి.
- ఎరువుల ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో గల రైతు సేవా కేంద్ర వ్యవస్థను పటిష్ఠ పరచాలి.

● దీపాల వెంకన్న



ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేటలోని పెద్దదేవాంగుల వీధిలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద వేంకటేశ్వరుని ఆకారంలో దీపారాధన నిర్వహించారు. ఇక్కడి గణపతి కూడా వేంకటేశ్వరుని రూపంలో దర్శనమివ్వడం విశేషం. - ఆమదాలవలస

పొరపాటా..? అక్రమమా..?

- డీఎస్సీలో తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి కాల్ లెటర్

శ్రీకాకుళం: ఆమదాలవలస మండలం కొత్తవలసకు చెందిన పైడి హరి డీఎస్సీ పరీక్ష రాశారు. ఆయనకు జోనల్ పీఈటీ పోస్టులో 82 మార్కులు వచ్చాయి. అయితే ఇతనికి కాల్ లెటర్ రాలేదు. ఆయన ఆదివారం కాల్ లెటర్లు వచ్చిన వారి జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. తనకంటే రెండున్నర మార్కులు తక్కువ వచ్చిన కె.నాగరాజు అనే అభ్యర్థికి కాల్ లెటర్ వచ్చినట్లు గమనించారు. వీరిద్దరూ బీసీ ఏ కేటగిరీకి చెందిన వారు కావడంతో మరింత లోతుగా పరిశీలించి అన్యాయం జరిగినట్లు గుర్తించారు. తక్షణం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా రాష్ట్రస్థాయిలో ప్రక్రియ జరుగుతోందని, విషయాన్ని రాష్ట్ర అధికారులకు నివేదిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. అటు తర్వాత హరి జిల్లా అధికారులను కలిసి జరిగిన అన్యాయం గురించి చెప్పారు. వారు సైతం జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు నివేదిస్తామని చెప్పారు. తనకంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి ఇప్పటికే ధ్రువీకరణ పత్రాల పరిశీలన కూడా పూర్తి కావడంతో హరి తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మంచం పట్టిన చింతలగార

టెక్కలి రూరల్: మండలంలోని చింతలగార గ్రామంలో గత కొద్ది రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో సుమారు 30 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. అందువల్లే జ్వరాలు ప్రబలుతున్నాయని చెబుతున్నారు. గ్రామవాసులు టెక్కలి ప్రభుత్వాస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

రోగులతో కిటకిట

టెక్కలి: ప్రస్తుతం వ్యాధులు ముసురుతున్న నేపథ్యంలో టెక్కలి జిల్లా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. మరో వైపు గ్రామాల్లో సరైన ఫీవర్ సర్వేలు లేకపోవడంతో ప్రతి ఇంట్లో జ్వర పీడితులు అవస్థలు పడుతున్నారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం రోజుకు 500 కు పైగా ఓపీ నమోదు కాగా వాటిలో సగానికి పైగా జ్వర పీడితులు ఉండడం గమనార్హం. జ్వరాల బారిన పడినవారిలో అధిక సంఖ్యలో పీడితులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగం వద్ద రోగులు

పంచాయతీ సిబ్బంది స్పందించలేదు



గ్రామంలో జ్వరాలు అధికంగా ఉన్నాయి. ప్రతి ఇంటిలో జ్వరం బారిన పడిన వ్యక్తులు ఉన్నారు. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పారిశుద్ధ్య పనులు చేపట్టలేదు.

– సిమ్మ ముఖలింగం, చింతలగార గ్రామం, టెక్కలి

క్లుప్తంగా

రెండు ప్రదేశాలకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్



లావేరు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద కేంద్ర బృందం సభ్యులు

గార: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతతో ఆహ్లాదకరంగా ఉండే ప్రదేశాలకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్‌ను ప్రకటిస్తున్నట్లుగా స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కేంద్ర బృందం తెలియజేసింది. ఈ మేరకు కేంద్ర బృంద రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ బిడ్డిక చంద్రరావు, సభ్యుడు అమ్మాజీరావులు సోమవారం లావేరు ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం), అంపోలు పంచాయతీ శ్రీకూర్మం జంక్షన్‌లో బీవీఆర్ ఫంక్షన్ హాల్ పరిసరాలను పరిశీలించి ఈ మేరకు రేటింగ్‌ను ప్రకటించారు. గ్రామీణ వాతావరణంలో ఆకట్టుకునేలా పరిసరాలను నిర్వహణ చేయడంతో ఈ రెండింటికీ గుర్తింపు లభించినట్లుగా కేంద్ర బృంద సభ్యులు వివరించారు.

విరిగిపడిన తరగతి గది సీలింగ్


తరగతి గదిలో విరిగిపడిన సీలింగ్

నరసన్నపేట: మాకివలస ప్రాథమిక పాఠశాలలో ఒకటో క్లాసు తరగతి గదిలో సీలింగ్ వర్షాలకు విరిగి పడింది. సోమవారం ఉదయం ఎవరూ లేని సమయంలో సీలింగ్ పడటంతో ప్రమాదం తప్పింది. గది మేడపైన వర్షాలకు నీరు స్టాక్ ఉండటంతో నీరు గోడల్లో లీక్ అవుతుండటంతో సీలింగ్ ఎల్ ఆకారంలో కిందకు పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ దాలినాయుడు వెంటనే వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో చెట్లు ఉన్నాయని, దీంతో ఆకులు, ఇతర వ్యర్థాలు ఉండటంతో మేడపై నీరు స్టాక్ అవుతుందని స్లాబ్ తడిగా ఉండటం, నీరు లీకు అవుతుండటం వల్ల సీలింగ్ పాడైందని తెలిపారు. పాఠశాలలో 39 మంది విద్యార్థులు ఉండగా ఈ గదిని హెచ్‌ఎం వినియోగిస్తున్నారని అప్పుడప్పుడు ఒకటి, రెండో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.

‘మత సామరస్యం ముఖ్యం’

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో శాంతి–సామరస్యాలు నిలబెట్టడమే మతసామరస్య కమిటీ లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మతసామరస్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ మతాలను అనుసరించే ప్రజల్లో అపార్థాలు, విభేదాలు రాకుండా కమిటీ కృషి చేస్తుందన్నారు. పండుగలు శాంతియుత వాతావరణంలో, మత సామరస్యంతో జరగాలన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 672 సీసీ కెమెరాలు అమర్చారని, మిగిలిన ప్రార్థనా స్థలాల్లో కూడా తప్పనిసరిగా వాటిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తర్వాత మత పెద్దలు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.


మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి కొత్తవీధిలో గొద్దు రాము అనే వ్యక్తి తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆమదాలవలస ఎస్‌ఐ ఎస్.బాలరాజు సోమవారం సిబ్బందితో దాడి జరిపారు. ఈ తనిఖీల్లో మొత్తం 144 మద్యం బాటిల్స్ పట్టుబడ్డాయి. దీంతో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, రామును అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

శేఖర్ అవయవాలు సజీవం


శేఖర్ మృతదేహం ముందు బైక్‌పై ర్యాలీ

బూర్జ: మన్యం జిల్లా సీతంపేట మండలం గదబవలస గ్రామానికి చెందిన చిలకల శేఖర్ ఇటీవల ఎచ్చెర్ల వద్ద రోడ్డు ప్రమాదానికి గురై శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు. అయితే ఆయనకు బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు గుర్తించడంతో కుటుంబ సభ్యులు అంత బాధలోనూ అవయవదానానికి అంగీకరించారు. దీంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో అవయవదాన ప్రక్రియను పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న గదబవలస గ్రామస్తులు శ్రీకాకుళం–పాలకొండ రోడ్డు మీదుగా ర్యాలీ చేస్తూ అంతిమయాత్ర నిర్వహించారు. ఇతను ఎచ్చెర్ల వెంకటేశ్వర కాలేజీలో చదువుతున్నాడు.


రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శేఖర్‌కు అంతిమ వీడ్కోలు

పెళ్లీడొచ్చింది... లక్ష్యం ఏమైంది..!

- నిరుపయోగంగా బాలికా సంరక్షణ పథకం
- బాండ్లు ఉన్నా నిధులు అందని వైనం
- మార్గదర్శకాలు లేకపోవడంతో అధికారుల మౌనం

హిరమండలం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో ప్రవేశపెట్టిన బాలికా సంరక్షణ పథకం అమలుపై అయోమయం నెలకొంది. బాలికల తల్లిదండ్రులకు భరోసా కల్పించేందుకు అప్పట్లో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఎవరికైనా బాలిక ఉంటే వారికి పాసుపుస్తకం జారీ చేసి 21 ఏళ్లు నిండాక నగదు చెల్లించాలని పథకంలో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేసి పేద కుటుంబంలో ఒక్కరే బాలిక ఉంటే 20 ఏళ్లు వచ్చిన తర్వాత వివాహ ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఇస్తామని, ఇద్దరుంటే ఒక్కొక్కరికీ రూ.30 వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించింది. అందుకుగాను అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అర్హులను ఎంపిక చేసి ఎల్‌ఐసీ బాండ్లు జారీ చేసింది. అయితే నిబంధనల మేరకు పేర్లు నమోదు చేసుకుని అప్పట్లో బాండ్లు పొందినవారికి, ప్రస్తుతం 20 ఏళ్లు పూర్తవుతున్నా నేటికీ డబ్బులు అందకపోవడంతో పలువురు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.


లబ్ధిదారులకు ఇచ్చిన ఎల్‌ఐసీ బాండ్

ఆది నుంచి గందరగోళమే

ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో శ్రీకారం చుట్టిన ఈ పథకం పరిస్థితి గందరగోళంగా తయారైంది. ఈ పథకం అమలు తీరు ప్రారంభం నుంచి అయోమయంగానే ఉండేది. బాండ్లు జారీ అయ్యాక తొలుత లబ్ధిదారులు ఎవరికి వారే డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. కొన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో మాత్రమే ఈ ప్రక్రియ జరిగింది. బాండ్లు అందడంలో పలు ఆటంకాలు ఏర్పడ్డాయి. 2005 నుంచి 2007 సంవత్సరాల్లో బాండ్లు పొందిన 4,880 మందికి మెచ్యూరిటీ తేదీ పూర్తయ్యి చాలాకాలమవుతున్నా ఇప్పటికీ స్పష్టత లేదు. ఎల్‌ఐసీ జారీ చేసిన బాండ్లును నగదుగా ఎలా మార్చుకోవాలో ఎవరికీ తెలియక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 2007 తర్వాత ఈ పథకం గురించి సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో లబ్ధిదారులకు ఎలా బదులివ్వాలనేది అధికారులకూ తెలియడం లేదు.

41,821 మంది లబ్ధిదారులు

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 41,821 మందిని అర్హులుగా అప్పట్లో అధికారులు గుర్తించారు. వీరిలో 26,935 మందికి గతంలో బాండ్లు అందించినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో చాలామంది లబ్ధిదారుల ఆడపిల్లలు ఇప్పుడు పెళ్లీడుకొచ్చారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల పేరిట ఉన్నబాండ్ పత్రాలు తీసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. అయినా వారి నుంచి సరైన సమాధానం ఉండటం లేదు. డబ్బులు చెల్లింపునకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం



లబ్ధిదారులు బాండ్లును ఎలా పొందాలో ప్రాజెక్టుల వారీగా తెలియజేస్తాం. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గడువు ముగిసిన బాండ్లును నగదుగా ఎలా మార్చుకోవాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– ఐ.విమల, ఐసీడీఎస్ పీడీ శ్రీకాకుళం

పథకం ప్రకారమే రాజశేఖర్ హత్య

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- ఆగస్టులో కత్తి కొనుగోలు చేసిన నిందితుడు


హత్యకు వినియోగించిన కత్తి

జి.సిగడాం: స్నేహితుడి చేతిలో గత నెల 24న హత్యకు గురై, చికిత్స పొందుతూ గెడ్డకంచరాం గ్రామానికి చెందిన పుక్కళ్ల రాజశేఖర్ మృతి చెందిన కేసులో ముద్దాయి దమరసింగి గొల్లబాబు అలియాస్ శంకర్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేసి పొందూరు కోర్టుకు తరలించారు. ముద్దాయికి రిమాండ్ నిమిత్తం శ్రీకాకుళం జైలుకు తరలించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం కేసు వివరాలు వెల్లడించారు.

ఇంటి నుంచి కత్తి తీసుకొచ్చి

మండలంలోని గెడ్డకంచరాం – బాతువ కూడలి వద్ద పుక్కళ్ల రాజశేఖర్ (35)ను గొబ్బూరు గ్రామానికి చెందిన దమరసింగి గొల్లబాబు(శంకర్) పథకం ప్రకారమే హత్య చేశాడని సీఐ తెలిపారు. గెడ్డ కంచరాం గ్రామంలో తోటి స్నేహితుడు మేస్త్రీ అప్పన్న ఇంట్లో ఒక శుభ కార్యానికి రాజశేఖర్, శంకర్ అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. అక్కడ స్నేహితుడు ఇచ్చిన మద్యం సేవించారు. ముద్దాయి గొల్లబాబు ఆలస్యంగా వెళ్లి మద్యం అడగగా.. వారు అప్పటికే మద్యం అంతా తాగేశామని చెప్పడంతో మద్యం విషయంలో ఇద్దరూ గొడవకు దిగారు. ఈ గొడవను అవకాశంగా తీసుకుని ముద్దాయి శంకర్ తన ఇంటి వద్ద భద్రపరుచుకున్న కత్తిని తీసుకొచ్చి రాజశేఖర్‌కు ఫోన్ చేశాడు. ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో లక్ష్మణ్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి రాజశేఖర్ ఎక్కడ ఉన్నాడని అడిగాడు. అయితే గొడవలు వద్దని లక్ష్మణ్ సూచించాడు. అనంతరం మృతుడు రాజశేఖర్, లక్ష్మణలు నడిచి వస్తుండగా గెడ్డకంచరాం గ్రామ కూడలి వద్ద మృతుడు రాజశేఖర్, ముద్దాయి గొల్లబాబు ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో రాజశేఖర్ కడుపులో పదునైన కత్తితో గొల్లబాబు పొడిచాడు. దీంతో వెంటనే లక్ష్మణ్ తన బైక్‌తో జి.సిగడాం ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆగస్టు 25న మృతి చెందాడు. మృతుడు భార్య హరిప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

మారణాయుధాలు స్వాధీనం

మృతుడు రాజశేఖర్‌తో గత కొన్ని రోజులుగా ముద్దాయి శంకర్‌కు గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆగస్టు నెలలోనే హత్య చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా పదునైన కత్తిని కొనుగోలు చేశాడు. దీంతో హత్యకు ఉపయోగించిన కత్తిని ఎస్‌ఐ మధుసూదనరావు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో ముద్దాయి ఇంటి చుట్టూ తనిఖీ చేశారు. హత్య జరిగిన వారం రోజుల్లోనే ముద్దాయితో పాటు ఆయుధాలను సేకరించి, సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడంపై జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం జి.సిగడాం ఎస్‌ఐ వై.మధుసూదనరావును అభినందించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

జలుమూరు: మండలంలోని కూర్మనాథపురం గ్రామానికి చెందిన మొయ్యి దాలినాయుడు(40) చెరువులో పడి ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారి మాదిరిగానే సాయంత్రం గ్రామ శివారున ఉన్న పిల్లల కోనేరు వద్దకు దాలినాయుడు స్నానానికి వెళ్లాడు. దీంతో ప్రమాదవశాత్తు అందులో జారి పడి మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయిన ఎంతసేపటికీ ఇంటికి రాకపోగా చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. మృతుడికి భార్య జగది, కుమారుడు సంతోష్ ఉన్నారు. జలుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో ఏఎస్‌ఐ మృతి


ఏఎస్‌ఐ ఆదినారాయణ

పోలాకి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఆదినారాయణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. గత కొన్నేళ్లుగా కాలిపై ఏర్పడిన గాయంతో బాధపడుతూ జెమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో ఆర్గాన్స్ పనితీరులో అంతరాయం ఏర్పడి మరణించారు. ఆదినారాయణ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారని గుర్తు చేసుకున్నారు. స్టేషన్ సిబ్బంది నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు


గాయాలపాలైన మహిళ

పలాస: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం పాత జాతీయ రహదారి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి స్కూటీ బోల్తాపడడంతో అంబుసోలి గ్రామానికి చెందిన కమ్మల సత్యతో పాటు చీమల కల్పనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదుపురంలో వైద్య శిబిరం

ఇచ్ఛాపురం రూరల్: ‘ఈదుపురంలో జ్వర పీడితులు’ అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించి క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. కంద్రవీధిలోని రోగులకు వైద్య బృందం రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసింది. పంచాయతీకి సంబంధించి ఆర్థిక సంఘ నిధులు లేకపోతుండటంతో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్యం నిర్వహించడం కష్ట సాధ్యమవుతుందని పంచాయతీ కార్యదర్శి విజయకుమారీ, సర్పంచ్ నర్తు వరప్రసాద్‌లు తెలిపారు. వైద్య శిబిరంలో సీహెచ్‌ఓ బి.దివ్యభారతి, హెల్త్ సూపర్‌వైజర్ త్రివిక్రమ్, ఏఎన్‌ఎం కమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఈదుపురం కంద్రవార్డులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆక్రమణల చెరలో ‘పోర్టుల్యాండ్’..?

- పట్టనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది
- గాలికొదిలేసిన పోర్టు అథారిటీ

పోలాకి: ఒకప్పుడు వెలుగు వెలిగిన కళింగపట్నం ఓడరేవు ఆ తర్వాత కాలంలో నౌకల రవాణా నిలిచిపోవడంతో సదరు ఓడరేవుకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మండలంలో ప్రస్తుతం నిరుపయోగంగా కేవలం రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే మిగిలిపోయిన పోర్ట్‌ల్యాండ్‌పై కొందరి కన్నుపడింది. అంపలాం పంచాయతీ పరిధి నందిగాం రెవెన్యూలో సర్వే నంబర్–77లో 31.45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూములు ఇప్పుడు విలువైనవిగా మారడంతో కొందరు పెద్దలు అక్కడ గ్రద్దల అవతారం ఎత్తారు. గతంలో టీడీపీ హయాంలో(2014–19 మధ్యలో) అక్కడ మత్స్యకారుల విశ్రాంతి భవనం, వలలు, చేపలు నిల్వ గోదాముల నిర్మాణం చేపట్టిన సందర్భంలో సైతం పోర్టు అథారిటీస్ నుంచి ఎలాంటి క్లియరెన్స్‌లు ఇవ్వకపోయినా, అప్పటి నాయకత్వం ముందుకు వెళ్లడం వెనుక వేరే ఉద్దేశాలు ఉన్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇదిలా ఉండగా గత నాలుగేళ్ల నుంచి ఈ భూముల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు సైతం నిర్వహించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. వేరే ప్రభుత్వ సర్వే నంబరుతో వర్క్ ఐడీ క్రియేట్ చేసి పోర్టు భూముల్లో ఉపాధి పనులు చేపడుతూ ప్రజావేదిక ఆడిటింగ్ సమయంలో మేనేజ్ చేస్తూ వస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి.


రాజారాంపురం వద్ద పోర్టుల్యాండ్‌లో అక్రమంగా తవ్విన చెరువు

హక్కులు కల్పించాలని వినతి

పోర్ట్‌ల్యాండ్ మొత్తం తమకే చెందుతుందని హక్కులు కల్పించాలని కోరుతూ ఇటీవల ఒక వ్యక్తి పోలాకి రెవెన్యూ కార్యాలయానికి వినతిపత్రం అందించిన నేపథ్యంలో ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. వినతి పత్రం వెనుక ఉన్నది ఎవరు అనే విషయంపై కూటమి పార్టీల నాయకుల్లో అంతర్గత చర్చ జరుగుతున్నట్లు సమాచారం. మరోపక్క పోర్టు భూముల్లో ఇప్పటికే ప్రైవేటు కార్యకలాపాలు జరుగుతున్నాయని సర్వే నిర్వహించి భూముల వివరాలు, వాస్తవ విస్తీర్ణంపై హద్దులతో సైతం ప్రజలకు తెలియజేయాలని మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది మాత్రం ఆక్రమణలపై ఎందుకో నిద్ర నటిస్తోంది. మరోపక్క తమ హక్కులను సైతం పోర్టు అథారిటీస్ గాలికొదిలేసింది. కనీసం తమ భూముల్లో ఫెన్సింగ్ వేసి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునే ఆలోచన కూడా చేయడం లేదు. ఇదే కొనసాగితే రూ.కోట్లు విలువ చేసే పోర్టుల్యాండ్‌లో అక్రమార్కులు లంగరు వేసే పరిస్థితి మరెంత దూరంలో లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.


పోర్టుల్యాండ్‌లో మత్స్యకారుల భవనాలు

రికార్డుల్లో స్పష్టంగా ఉంది



రెవెన్యూ రికార్డుల్లో పోర్టుల్యాండ్ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. నందిగాం రెవెన్యూలో ఎస్‌ఎల్‌ఆర్‌లో పోర్టు అథారిటీస్‌కు 31.45 ఎకరాల భూములు ఉన్నట్లు వివరాలు ఉన్నాయి. ఆక్రమణలపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. పోర్టు అథారిటీస్ వారు వచ్చి హద్దులు కోరితే చూపించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– పి.శ్రీనివాసరావు, తహసీల్దార్, పోలాకి

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 64 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ నిర్వహించారు. దీనిలో భాగంగా పలు శాఖలకు చెందిన అధికారులు మొత్తం 64 ఫిర్యాదులు స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 21, సెర్ప్‌కు 13, పంచాయతీరాజ్, విద్యుత్ పంపిణీ సంస్థలకు తలో 5, నీటి వనరులకు 3, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయ శాఖలకు తలో 2 చొప్పున ఫిర్యాదులు అందాయి. మిగతా శాఖలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున నమోదైంది. ఈ పీజీఆర్‌ఎస్‌లో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలు వినతులు పరిశీలిస్తే...

- రాష్ట్ర ప్రభుత్వం మండలాల పునర్విభజన చేయనున్న నేపథ్యంలో లావేరు మండలం మురపాక గ్రామం మండల కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అలాగే లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన ప్రజలు కూడా పీజీఆర్‌ఎస్‌లో బుడుమూరు మండల కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని వినతి అందజేశారు.
- నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన బడ్డి జోగారావు శతశాతం దివ్యాంగుడు. దీంతో ఆయనకు రూ.15 వేల పింఛను ఇప్పించాలని కోరారు. అలాగే రణస్థలం మండలానికి చెందిన దివ్యాంగుడు కొయ్య దుర్గాప్రసాద్ తనకు పింఛన్ ఇప్పించాలని కోరారు.
- ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ తెలప్పరేడు వద్ద రహదారిపై మద్యం షాపును ఏర్పాటు చేశారు. ఈ షాపు వలన స్థానికులకు ఇబ్బందులు వస్తున్నాయని, అక్కడ నుంచి వేరే చోటుకు ఈ మద్యం షాపును తొలగించాలని ఆ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, గోవిందరావు తదితరులు కోరారు.
- శ్రీకాకుళం మండలం బలగ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్–1లో సబ్ డివిజన్1, 4ల్లో ఉన్న ప్రభుత్వ భూమి వరదగట్టు (కోనేరు) దురాక్రమణలకు గురైందని, స్థానిక వీఆర్వో, సచివాలయం సర్వేయర్ కలిసి మండల రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన బోనెల చిరంజీవి ఫిర్యాదు చేశారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

కవిటి: మండలంలోని గొర్లెపాడు పంచాయతీలో భూ ఆక్రమణలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూముల్ని రక్షించే చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణస్వామి కోరారు. ఈ మేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గొర్లెపాడు పంచాయతీ పరిధిలోని చాలా వరకు ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు, సంతలు ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఒక ఆర్మీ జవాన్ భూములు కూడా అన్యాక్రాంతం అయినట్లు పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన భూములపై గతంలో ఎన్నోసార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ, ఎటువంటి చర్యలను చేపట్టడం లేదని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై సరైన న్యాయం చేయలేని పక్షంలో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. వాస్తవానికి ఇదే భూ ఆక్రమణలపై గతంలో సాక్షి పత్రికలో సైతం కథనాలు వెలువడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ దృష్టికి తీసుకొచ్చారు.


కవిటి: జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేస్తున్న నారాయణస్వామి

ఎస్పీ గ్రీవెన్సుకు 51 వినతులు


ఫిర్యాదుదారుల సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (గ్రీవెన్సు)లో ప్రజల నుంచి 51 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీలు స్వీకరించి సకాలంలో పరిష్కారం చూపుతామని బాధితులకు భరోసా ఇచ్చారు.

సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

- ప్రేమ పెళ్లికి నిరాకరించినట్లు ఆవేదన

శ్రీకాకుళం క్రైమ్: పెళ్లికి యువతి నిరాకరించిందనే కారణంతో ఆత్మహత్య చేసుకుంటానని యువకుడు సెల్‌ఫోన్ టవర్ ఎక్కిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం వేకువజామున 3.30 గంటల సమయంలో శ్రీకాకుళం నగరంలోని పాత దీప మహల్ సమీప టవర్ మీదకు ఒక యువకుడు అవలీలగా ఎక్కాడు. ఉదయమయ్యేసరికి అటుగా వెళ్లే ప్రజలు గమనించారు. ల్యాప్‌టాప్ పట్టుకుని సిగ్నల్స్ దొరకక అక్కడ కూర్చుని ఉన్నాడని అనుకున్నారు. అయితే ఎంతకీ దిగకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటాడేమోనన్న ఆందోళనతో ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణకు సమాచారమిచ్చారు. సరిగ్గా ఉదయం 8 గంటలకు అగ్నిమాపక కార్యాలయానికి కూడా కాల్ వెళ్లింది. అంతే క్షణాల్లో ఘటనా స్థలానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. 8.45 గంటలకు ఎస్‌ఐ హరికృష్ణ చొరవతో అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ పూర్తి చేసి యువకుడిని కిందికి దించగలిగారు.


టవర్‌పై యువకుడు

ఇదీ విషయం...

పొందూరు మండలంలోని కింతలి గ్రామానికి చెందిన విభూది శివకుమార్ (30) అనే యువకుడు ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన ఒక యువతిని గత ఐదేళ్లుగా ప్రేమిస్తున్నాని.. ప్రేమకు అంగీకరించిన యువతి వివాహానికి నిరాకరించిందని పోలీసుల వద్ద చెప్పాడు. దీనికి కారణం వారి పెద్దలేనని.. భరించలేకే ఇలా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని పేర్కొన్నాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ ఎం.హరికృష్ణ మాట్లాడుతూ గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సమక్షంలో చట్ట పరిధిలో ఇటువంటి వ్యవహారం పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే చట్టప్రకారం తాము న్యాయం చేస్తామని యువకుడికి హామీ ఇచ్చి రిమ్స్‌కు పంపించారు. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


అదుపులోకి తీసుకున్న రెస్క్యూ సిబ్బంది

కన్నబాబుకు మాజీ స్పీకర్ తమ్మినేని పరామర్శ


కన్నబాబును పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం తదితరులు

ఆమదాలవలస: మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం సోమవారం కాకినాడలోని కన్నబాబు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతితో కుటుంబానికి మాత్రమే కాకుండా, పరిసర ప్రాంతాలకు కూడా తీరని లోటు ఏర్పడిందన్నారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, రాష్ట్ర ఇంటిలెక్చువల్ కార్యదర్శి రామకృష్ణరావు, జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, రణస్థలం ఎంపీపీ పిన్నింటి సాయి, బూర్జ ఎంపీపీ కర్నేన నాగేశ్వరరావు, బూర్జ జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాది సింగుపురం మోహనరావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముత్తా విజయ్, బొడ్డేపల్లి నారాయణరావు, జల్లు బలరాం నాయుడు, చింతాడ సూర్యనారాయణ, గుమ్మడి రాంబాబు, పొందూరు మండల నాయకులు పప్పల రమేష్, మామిడి కిరణ్, మామిడి శ్రీను, బెండి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.